www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 1 జులై 2024 | 8 పేజీలు

ఏలూరు | పశ్చిమ గోదావరి

అమ్మో.. జులై..!

గోదావరి వరదకు నీట మునిగిన రోడ్డు (ఫైల్‌ఫొటో)

పోలవరం నిర్వాసితుల్లో గోదావరి వరద గుబులు

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల జనం బిక్కుబిక్కు

వరద భీభత్సంతో ప్రతియేటా గ్రామాలన్నీ అతలాకుతలం

తాత్కాలిక చర్యలతో ప్రభుత్వం కాలయాపన

పునరావాస పరిహారం ఇవ్వకుండా, ఇళ్లు కట్టకుండా నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితులను మళ్లీ వరద భయం వెంటాడుతోంది. ప్రతియేటా జులైలో విరుచుకుపడుతున్న గోదావరి వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. దీంతో ఈ ఏడాది పరిస్థితి ఏ విధంగా ఉంటుందోననే భయం నిర్వాసితులకు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. ప్రాజెక్టు పనులు ముందుకు సాగిస్తున్న ప్రభుత్వాలు నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా, ఇళ్లు నిర్మించకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. దీంతో ప్రతియేటా గోదావరి వరదలకు నిర్వాసితులంతా వరద బాధితులుగా మారి నరకం అనుభవిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో కుక్కునూరు, వేలేరుపాడు ..2లో

భారీ వర్షం..

కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

నిలిచిన విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి - మండవల్లి

మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు చెట్లు, స్తంభాలు పడిపోయాయి. జాతీయ రహదారి-165పై రైల్వే స్టేషన్ వద్ద భారీ వృక్షం నేలనంటింది. దీంతో ఈ ప్రాంతంలో నాలుగు విద్యుత్ స్తంభాలు పడిపోయి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఫలితంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ..2లో

వైద్య వృత్తి వాణిజ్య అంశం కారాదు

డాక్టర్ బి.సి.రాయ్‌ను వైద్యులు ఆదర్శంగా తీసుకుని వైద్య వృత్తిని సేవాదృక్పథం, నిబద్ధత, అంకితభావంతో నిర్వర్తించడానికి కృషి చేయాలి. నాడు రోగి ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా రోగాన్ని నయం చేయడంపైనే వైద్యులు దృష్టి సారించేవారు. నేడు నగదు ఉంటేనే నాడి చూస్తున్నారు. వైద్యం వ్యాపారమైపోయింది. వైద్యుడు-రోగి సంబంధం వాణిజ్య అంశంగా తయారైంది. జీవితంలో ఎంత సంపదున్నా ఆరోగ్యం బాగా లేకపోతే అన్నీ వృథానే. ఆరోగ్య పరిరక్షణ పట్ల ఆధునిక సమాజంలో చైతన్యం పెరుగుతోంది. అందుకే మనిషి తన దైనందిన జీవితంలో ఆరోగ్య పరిరక్షణకు డబ్బు ఖర్చు ..2లో

4న అల్లూరి శతవర్ధంతి సభ

8లో.. హాస్టల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన అవసరం

ఏలూరు టౌన్ :దోమ అత్యంత ప్రమాదకరమైన కీటకమని, దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వెక్టార్ బోర్న్ డిసీజ్ (విబిడి) రాష్ట్ర కో ఆర్డినేటర్, అసిస్టెంట్ మలేరియా అధికారి ఎం.పార్వతీశం సూచించారు. స్థానిక ఏలూరు కొత్తపేట గాంధీ నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దోమ చిన్న కీటకమైనప్పటికీ దాని ద్వారా ప్రమాదకరమైన వ్యాధులు డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా సంక్రమిస్తాయని తెలిపారు. విద్యార్థులు దోమకాటుకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్తపేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శశాంక్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ వారానికోసారి మంచి నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయాలన్నారు. పిఇటి టీచర్ అరుణ, ఇందిర మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలు కలిగి జీవించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చు కోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఆచరించడంలో ముందుండాలని సూచించారు.

పెన్షన్ల పంపిణీకి సర్వం సిద్ధం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇంటి వద్దే లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు శనివారమే బ్యాంకుల నుంచి 11,695 మంది లబ్ధిదారులకు కావాల్సిన రూ.7,77,93,500 డ్రాచేసి ఆయా పంచాయతీ, సచివాలయం సిబ్బంది వద్ద పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచారు. ఉంగుటూరు ఎంఎల్‌ఎ ధర్మరాజు తన నియోజకవర్గంలో ప్రతి మండలంలో నాలుగేసి గ్రామాల్లో స్వయంగా ఆయన పాల్గొని పింఛన్లు పంపిణీ చేస్తారని క్యాంపు కార్యాలయం ప్రకటనలో వెల్లడించింది.

ముదినేపల్లి :జులై ఒకటో తేదీ నుంచి పింఛన్ల సొమ్ము పంపిణీ చేసేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. మండలవ్యాప్తంగా తొమ్మిది వేల పై చిలుకు మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరికి రూ.6.12 కోట్లు సొమ్ము పంపిణీ చేయాల్సి ఉంది. వీటిని సోమవారం పంపిణీ చేయాల్సి ఉండగా, ఆదివారం సెలవు కావడంతో బ్యాంకు ద్వారా పంచాయతీ కార్యదర్శులకు శనివారం సాయంత్రమే ఈ నగదును అందించారు. సోమవా రం ఉదయం ఆరు గంటల నుంచి మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లోని పింఛన్ లబ్ధిదారులకు నగదును ఒక్కొక్కరికి రూ.ఏడు వేల చొప్పున గ్రామ సచివాల యాల ఉద్యోగుల ద్వారా నగదు పంపిణీ చేయనున్నారు.

నూజివీడు టౌన్ :నూజివీడు రూరల్ మండలం పోతురెడ్డిపల్లి గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారధి పాల్గొంటారు. అనంతరం నూజివీడు పట్టణంలోని 26వ వార్డు గాంధీనగర్‌లో, ఆగిరిపల్లి పట్టణంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

కొయ్యలగూడెం : ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్ అందించనున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్య కర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ముసునూరు : పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలందరూ ఉద్యోగులతో పాటు పాల్గొనాలని ఆ పార్టీ మండలాధ్యక్షులు దేవినేని ధర్మారావు కోరారు. ఒకటో తేదీన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చింతలపూడిలో సూపర్ మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి - చింతలపూడి

యువత వ్యాపారాలు వైపు అడుగులు వేసి అభివృద్ధి చెందాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. పట్టణంలో బోసుబొమ్మ సెంటర్‌లో బెస్ట్ బజార్ సూపర్ మార్కెట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని స్వామ్ ఐటిఐ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్వామ్ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉపాధి, శిక్షణ అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో ప్రవేశాలు పొందడానికి జులై 24 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ దరఖాస్తులను జులై 25న పరిశీలిస్తారన్నారు. 26న మెరిట్ జాబితా ప్రకటిస్తా రన్నారు. ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలకు 27, 28వ తేదీల్లో, అలాగే ప్రయివేట్ కళాశాలల్లో ప్రవేశాలకు 29, 30 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాల కోసం కళాశాలలో వ్యక్తిగతంగా గాని, లేదా సెల్ 98496 55419 సంప్రదించాలని ప్రిన్సిపల్ సత్యనారాయణ కోరారు.

అమ్మో.. జులై..!

(మొదటి పేజీ నుంచి)

మండలాల్లో ప్రతియేటా వరదలు భీభత్సం సృష్టిస్తున్నా శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయకపోవడం దుర్మార్గంగా చెప్పొచ్చు. ప్రాజెక్టులో కాఫర్‌డ్యామ్ నిర్మాణం పూర్తవ్వడంతో భద్రాచలం వద్ద 50 అడుగుల ఎత్తుకు వరద నీరు రాకుండానే గ్రామాలన్నీ ముంపుబారిన పడుతున్నాయి. ఈ రెండు మండలాల్లో దాదాపు 107 వరకూ గ్రామాలు ఉండగా వంద గ్రామాల వరకూ వరద నీరు చుట్టుముడుతోంది. గోదావరికి వరద నీరు పోటెత్తడంతోనే కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెం, వేలేరుపాడు మండలంలోని కొయిదా వంటి దాదాపు 20కుపైగా గ్రామాలు ఖాళీ చేయాల్సి వస్తోంది. గోదావరి వరదల ఉధృతితో నిర్వాసిత ప్రజలు కొండలు, గుట్టలపై నెలలు తరబడి కాలం గడపాల్సిన దుస్థితి నెలకొంది. ఈ రెండు మండలాల్లో దాదాపు 20 వేలకుపైగా కుటుంబాలు ఉన్నాయి. వరదలకు రోడ్ల మార్గాలన్నీ మూసుకుపోయి ఆ గ్రామం, ఈ గ్రామం అనే తేడా లేకుండా ప్రజలంతా వరద బాధితులుగా ఇబ్బందులు పడుతున్నారు. వరదలు వచ్చిన తర్వాత తాగునీరు, నిత్యావసర వస్తువుల కోసం నానావస్థలు పడుతున్నారు. ప్రభుత్వం కుటుంబానికి రూ.వెయ్యి, నాలుగు రకల కూరగాయలు అందించి చేతులు దులుపుకుంటున్న పరిస్థితి ఉంటోంది. వరదలతో పొలాలన్నీ ముంపు బారిన పడటంతో నెలలు తరబడి ఉపాధి లేక, ప్రభుత్వం నుంచి సరైన సాయం అందక అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఎంత చెప్పినా తక్కువే. ప్రభుత్వం నిర్వాసితులను తరలించేందుకు మొదటి కాంటూరు, రెండో కాంటూరు అంటూ లెక్కలు పెట్టింది. అయితే గడిచిన రెండేళ్ల వరద పరిస్థితులను గమనిస్తే కాంటూరు లెక్కలన్నీ బూటకమని తేలిపోయింది. ముంపులేని కివ్వాక పునరావాస కాలనీని సైతం వరద నీరు చుట్టుముట్టడమే దీనికి నిదర్శనం. కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా గ్రామాలన్నీ ముంపుబారిన పడుతున్నాయి. దీంతో ముంపు బారిన పడిన గ్రామాలను మొదటి కాంటూరులో చేర్చాలని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనలు చేపట్టినా పట్టించుకున్న దాఖలాల్లేవు. వరదలు వచ్చిన ప్రతిసారీ స్కూళ్లలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు నెలలు తరబడి చదువులకు దూరం కావాల్సి వస్తోంది. ఈ ఏడాది జులై, ఆగస్టు నెలల్లో వరదలు వచ్చే ప్రమాదం ఉంది. దీంతో పోలవరం నిర్వాసితుల గురించి ప్రభుత్వం ఆలోచన చేయాల్సి ఉంది. ప్రభుత్వం మారడంతో ఏ విధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

పరిహారం అందించకుండా నిర్లక్ష్యం

పునరావాస పరిహారం అందించి కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని నిర్వాసితులను గ్రామాల నుంచి ఖాళీ చేయించాల్సి ఉంది. ప్రభుత్వం ఆటువైపు కనీస ఆలోచన కూడా చేయడం లేదు. గత వైసిపి ప్రభుత్వం పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలు, 2006కు ముందు సేకరించిన భూములకు రూ.ఐదు లక్షలు ఇస్తామని చెప్పి నిర్వాసితులను మోసగించింది. ఐదేళ్ల పదవీ కాలంలో నిర్వాసితులకు పరిహారం అందించకుండా వదిలేసింది. గ్రామాలను వదిలి బయటికి వస్తే ప్రభుత్వం పరిహారం ఇచ్చే అవకాశం ఉండదని తెలిసి నిర్వాసితులు గ్రామాల్లోనే ఉంటున్నారు. దీంతో వరదలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్వాసితుల కోసం జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టినా అవి పూర్తి చేయని పరిస్థితి ఉంది. నిర్మాణం పూర్తి చేసినట్లు చెబుతూ నిర్వాసితులను తరలించిన కాలనీల్లోనూ తాగునీరు, రోడ్లు, ఉపాధి వంటి కనీస వసతులు లేకుండాపోయాయి. పునరావాస పరిహారం, యువతకు ప్యాకేజీ, భూమికి భూమి వంటి సమస్యలను పరిష్కరించి నిర్వాసితులను గ్రామాల నుంచి పంపించాల్సి ఉంది. ప్రభుత్వం ఆ పని చేయనంత కాలం పోలవరం నిర్వాసితులు ప్రతియేటా వరద బాధితులుగా కష్టాలు అనుభవించాల్సిన దుస్థితి కొనసాగనుంది. కొత్త ప్రభుత్వమైనా నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాల్సి ఉంది.

భారీ వర్షం..

(మొదటి పేజీ నుంచి)

ఏర్పడింది. విద్యుత్ శాఖ ఎఇ రామకృష్ణ పర్యవేక్షణలో ఆదివారం ఉదయం సిబ్బందితోపాటు వర్కర్లను ఏర్పాటు చేసి మరమ్మతులు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. జాతీయ రహదారిపై ఉన్న గోతుల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపించింది. ప్రాథమిక పాఠశాల-1, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, శివాలయం వీధి, రైల్వే గేటు ప్రాంతం పూర్తిగా నీట మునిగాయి. బిసి కాలనీలో హాస్టల్‌కు వెళ్లే మార్గం, మంచాలు తయారు చేసే వారి కాలనీలోని మరో రెండు సిమెంట్ రోడ్లపై పెద్దఎత్తున నీరు నిలిచింది. ఆ ప్రాంతాల్లో డ్రెయినేజీ కూడా లేకపోవడంతో మురుగునీరు వర్షపు నీటితో కలిసి దుర్వాసన వస్తోంది. వ్యాధులు ప్రబలుతాయని బిసి కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

ఉండి: మండలవ్యాప్తంగా శనివారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా ఉండి బస్టాండ్ పూర్తిగా జలమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఆచంట: ఆదివారం తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తూనే ఉంది. వర్షం కొబ్బరి చెట్లకు ఎంతో మేలు చేసిందని రైతులు చెబుతున్నారు. వర్షంతో పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. కచ్చా డ్రెయిన్లు పొంగి మురుగునీరు రోడ్లపైకి వచ్చేయడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

ముదినేపల్లి: మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకూ వర్షం పడుతూనే ఉంది. దీంతో జనజీవనం స్తంభించింది. వర్షంతో రోడ్లు జలమయంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లోని పలు కాలనీల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో ఆయా కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. వర్షంతో కార్మికులకు పనుల్లేక ఇళ్ల వద్దే ఉండిపోయారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

నరసాపురం: జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకూ గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలను అధికారులు వెల్లడించారు. అత్యధికంగా నరసాపురంలో 80 మిల్లీమీటర్లు, అత్యల్పంగా అత్తిలిలో 15.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాడేపల్లిగూడెం 56.4, పెంటపాడు 53, గణపవరం 36.6, పాలకొల్లు 30.8, పాలకోడేరు 30.4, ఆకివీడు 29.2, భీమవరం 27.4, మొగల్తూరు 28.2, ఉండి, తణుకుల్లో 26.4, కాళ్ల 25.2, ఇరగవరం 24.4, యలమంచిలి 22.4, పెనుమంట్ర 21.6, వీరవాసరం 20.4, పోడూరు 20.2, పెనుగొండ 19.2, ఆచంట 18.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా 30.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

వైద్య వృత్తి వాణిజ్య అంశం కారాదు

(మొదటి పేజీ నుంచి)

చేసేందుకు, సమయాన్ని వెచ్చించేందుకు పెద్దపీట వేస్తున్నాడు. ఆధునిక టెక్నాలజీ వైద్యరంగం స్వరూపాన్నే సమూలంగా మార్చేసింది. శరీరంలోని ప్రతి అవయవాన్నీ, ప్రతి భాగాన్నీ శోధించి రోగానికి కారణాలేమిటో కచ్చితంగా కనిపెట్టగలిగే యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అందువల్ల వైద్యుని పాత్ర కూడా వేగంగా మారిపోయింది. స్పెషలైజేషన్స్ బాగా పెరిగిపోయాయి. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు పెరుగుతున్నాయి. ఆస్పత్రిలో చేరిన రోగి ఆరోగ్యంగా తిరిగి వెళ్లే పరిస్థితులు మెరుగుపడ్డాయి. మరోవైపు కుటుంబ వైద్యులు కనుమరుగవుతున్నారు. రోగికీ, వైద్యునికీ మధ్య అంతరం పెరుగుతోంది. అలాగే వైద్యంలో ఆధునికీకరణ ఫలితాలు, నూతన ఆవిష్కరణలు సామాన్యులకు అందడం లేదు. ప్రపంచీకరణ విధానాలు వైద్యరంగాన్ని బాగా దెబ్బతీశాయి. ప్రభుత్వ వైద్యాన్ని పాలకులే నాశనం చేస్తున్నారు. ఈ రంగంలో ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ వేగంగా అమలవుతోంది. వైద్య విద్యావ్యాపారం దగ్గర నుండే ఇది ప్రారంభమవుతోంది. రోగ నివారణ చర్యలకు ప్రభుత్వాలు మంగళం పాడాయి. నివారణకన్నా చికిత్సకు ప్రాధాన్యతనిస్తున్నాయి. డబ్బున్న వారికి, డబ్బులొచ్చే జబ్బులకూ వైద్యం అందుబాటులోకి వచ్చింది. డబ్బులేనోళ్లకూ, డబ్బులు రాని జబ్బులకూ వైద్యం దూరమైపోతోంది. అనేక సమస్యలు కూడా వైద్యరంగాన్ని పట్టిపీడిస్తున్నాయి. వైద్య రంగంలో అభివృద్ధిని రెండు పార్శ్వాలుగా చూడొచ్చు. మంచి, చెడు రెండూ ఉన్నాయి. వాటిపై సమాజంలో చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కరోనా సమయంలో వైద్యుల వైపు చూసిన ప్రపంచం

ప్రపంచం యావత్తూ వైద్యుల వైపు చూస్తోంది. రకరకాలుగా ప్రజల్ని పీడిస్తున్న, కొత్తగా పుట్టుకొస్తున్న వ్యాధుల బారి నుండి తమను రక్షించేది వైద్యులేనని నమ్ముతోంది. సునామీలా ప్రపంచాన్ని చుట్టేసి అతలాకుతలం చేసిన కరోనా బాధితులకు ముందు వరుసలో ఉండి వైద్యసేవలు అందించిన వైద్యులకు శిరస్సు వంచి మోకరిల్లుతోంది. మృత్యుఅంచుల్లోకి వెళ్లిన ప్రజలకు తమ చికిత్స ద్వారా పునర్జన్మను ప్రసాదించిన దేవుళ్లుగా కొలుస్తోంది. కరోనా నుండి మానవాళిని రక్షించేందుకు తమ జీవితాలను సైతం ఫణంగా పెట్టిన వారికి చేతులెత్తి మొక్కుతోంది. ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపేది శాస్త్ర విజ్ఞానం తప్ప మరొకటి కాదని నమ్ముతోంది. కరోనా సమయంలో ప్రపంచం విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది అందించిన సేవలను కొనియాడక తప్పదు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం, తణుకు వైద్య కేంద్రాలుగా ఉండేవి. ప్రస్తుతం ఏలూరు, తాడేపల్లిగూడెం, నూజివీడు, జంగారెడ్డిగూడెం, కైకలూరు, చింతలపూడి, పాలకొల్లు, నరసాపురం, ఆకివీడు వంటి పట్టణాల్లోనూ వైద్యసేవలు విస్తరించాయి. అయితే ఇవన్నీ ప్రయివేటు రంగంలో చోటుచేసుకుంటున్న అభివృద్ధి అడుగులే. ప్రభుత్వపరంగా వైద్యులుంటే పరికరాలుండవు.. పరికరాలుంటే వైద్యులు, సాంకేతిక నిపుణులు ఉండరు. ప్రభుత్వ వైద్యరంగం బలోపేతం కావడంతోపాటు మందులపై జిఎస్‌టి రద్దు చేస్తే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు మేలు. అదే సందర్భంలో ఏలూరులో ప్రభుత్వ వైద్యకళాశాల ప్రారంభమైంది. అయితే అది అన్ని హంగులూ సమకూర్చుకోవాల్సి ఉంది. ఇక పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం దగ్గులూరులో ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసినా ఇప్పటికీ పనులేవీ ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ప్రభుత్వ వైద్యకళాశాల త్వరితగతిన ఏర్పాటు చేస్తే మరిన్ని వైద్య సౌకర్యాలు, మరింత మంది వైద్యులు జనానికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అంతటి ప్రాధాన్యత కలిగిన వైద్యవృత్తిలో ఉండి ప్రజల ప్రాణాలు కాపాడుతున్న వైద్యుల సేవలను జులై 1న జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మననం చేసుకోవడం మన కర్తవ్యం.

- డెస్క్

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, నరసాపురం పట్టణం, 26 వార్డు, రుస్తుంబాద ప్రాంతానికి చెందిన దేవా శ్యాంబాబు, తండ్రి: SOMSON అను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. మా ఇంటి వద్ద నుండి నరసాపురం సెంటర్‌కు జిరాక్స్ నిమిత్తం వెళుతుండగా మార్గ మధ్యలో పడిపోయినది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్: **S5322732** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్:
దేవా శ్యాంబాబు
తండ్రి: SOMSON
డోర్ నెం. 16-2-68/1, పాశెర్లవారి వీధి
రుస్తుంబాద, 26వ వార్డు, నరసాపురం పట్టణం,
ప.గో.జిల్లా, పిన్: 534275
సెల్: 8341341035

నూతన చట్టాలపై అవగాహన అవసరం : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నేటి నుంచి భారతీయ శిక్ష చట్టంలో నూతనంగా అమల్లోకి రానున్న చట్టాలపై అధికారులకు సిబ్బందికి తలెత్తిన సందేహాలను నివృత్తి చేయడానికి ప్రత్యేకంగా న్యాయ సలహా దారులను ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు ఎస్‌పి స్వరూపరాణి తెలిపారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్‌పి ఛాంబర్‌లో జిల్లావ్యాప్తంగా ఉన్న అధికారులతో, సిబ్బందితో ఆమె ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నేటి నుంచి అమలు కానున్న నూతన చట్టాలపై పూర్తి అవగాహన కోసం వీడియో కాన్ఫరెన్స్‌ను ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి స్వరూపరాణి మాట్లాడుతూ 1860 నుంచి భారతీయ శిక్ష చట్టాలు అమల్లో ఉన్నాయని, వాటి బదులుగా అనుకూలమైన చట్టాలను రూపకల్పన చేసి వాటిని నేటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు న్యాయ సలహా దారులను సబ్ డివిజన్ల వారీగా ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఏదైనా సందేహం తలెత్తిన సమయంలో వెంటనే సంబంధిత న్యాయ సలహాదారులకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఈ చట్టాల అమలుపై ఆన్‌లైన్‌లో శిక్షణ తరగతులు నిర్వహించామని చెప్పారు. నూతన చట్టాలపై అవగాహన కోసం సంకలన్ అనే యాప్‌ను ప్రభుత్వం రూపొందించిందని, వీటిని సెల్‌ఫోన్‌లో పొందుపరచుకోవడం ద్వారా చట్టాలపై మరింత అవగాహన కలుగుతుందని తెలిపారు. చట్టాల అమలకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ స్కోర్ అడిషనల్ పిపి బ్రహ్మయ్య, డిటిసి డిఎస్‌పి ప్రభాకర్, డిసిఆర్‌బి సిఐ సుబ్బారావు, ప్రస్తుతం పోలీసు లీగల్ అడ్వైజర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలందరికీ అండగా ఉంటా

ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజలు మనకు ఇచ్చింది అధికారం కాదని, బాధ్యతగా భావించి ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేద్దామని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలకు అండగా ఉండాలన్నారు. విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకులు, కార్యకర్తల సేవలు పార్టీ ఎన్నటికీ మరచిపోదన్నారు. ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌ను దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో పెదపాడు మండలానికి చెందిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుల బృందం ఆదివారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలనను అంతం చేయటానికి, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బిజెపి నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని తిరిగి పునరుద్ధరించడానికి కూటమిలోని ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త సైనికుల్లా కృషి చేశారన్నారు. వారి సేవలను పార్టీ ఎన్నటికీ మరచిపోదన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన ఈ అధికారాన్ని బాధ్యతగా భావించి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా ఉండి, వారి సమస్యలు పరిష్కారమయ్యేలా చేసినప్పుడే ప్రజల నమ్మకాన్ని నిజం చేసిన వాళ్లవుతామన్నారు. చింతమనేని ప్రభాకర్‌కు సమన్వయ కమిటీ సభ్యులు భారీ పుష్పగుచ్ఛం అందించి, పట్టు శాలువాలతో సత్కరించి, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ప్రతిమను అందించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండలంలోని నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు ఉప్పలపాటి శ్రీరామ్‌ప్రసాద్, గారపాటి రామ సీతా, మోరు శ్రావణి దశరథ్, గుత్తా అనిల్, లావేటి శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వరరావు, ముళ్లపూడి సాంబశివరావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అసంఘటిత రంగంలో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన బోర్డులను వెంటనే తెరిపించాలని, భవన నిర్మాణ, హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డును పరిరక్షించాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను విడుదల చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కెవి.రమణ, బి.వెంకటరావు డిమాండ్ చేశారు. నగరంలోని ఐఎఫ్‌టియు జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు కెవి.రమణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు కెవి.రమణ, బి.వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో ఏర్పాటైన నూతన ప్రభుత్వాలు కార్మిక రంగంలో ఉన్న సమస్యల పరిష్కారానికి వెంటనే పూనుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్, పి.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి గ్రీష్మ కుమార్, ఎండివి.ప్రసాద్, అప్పారావు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు విద్యే మూలం

ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ధనార్జనొక్కటే గొప్పకాదని, విద్యాసముపార్జనకు చేయూతనందించడమే సమాజ శ్రేయస్సుకు మూలమని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు తూర్పువీధిలోని బాల త్రిపుర సుందరి సోమలింగేశ్వర దేవాంగ కళ్యాణ మండపంలో ఏలూరు దేవాంగ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు సంఘ సభ్యులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పలువురు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు మూలం విద్యేనని, విద్యాసముపార్జనకు ప్రతిఒక్కరూ చేతనైన సాయం చేయాలని సూచించారు. తాను కూడా కొందరు విద్యార్థులకు అవసరమైన సాయం చేస్తున్నానన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పులు సాధ్యమవుతాయన్నారు. ఈ బాటలోనే ముందుకు వెళ్తున్న దేవాంగ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సభ్యుల సేవలు అభినందనీయమన్నారు. డిపిఇ, రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ టిఎస్.విశ్వనాథ్ మాట్లాడుతూ ఇదే విధంగా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందుకు తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు.

పెన్షన్లకు ఎన్‌టిఆర్ భరోసా పేరు హర్షణీయం

ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

కీర్తిశేషులు ఎన్‌టిఆర్ పేరును పెన్షన్ల కార్యక్రమానికి పెట్టడం హర్షణీయమని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్‌కు అభినందన సత్కార సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఎన్నికలకు ముందే మ్యానిఫెస్టోలో సిఎం చంద్రబాబు చెప్పినట్లు పెన్షన్ను ఒకేసారి రూ.వెయ్యికి పెంచామని చెప్పారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్‌కు బొకే ఇచ్చి స్వాగతం పలికారు.

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలివ్వాలని కెవిపిఎస్ వినతి

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలని కెవిపిఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ కోరారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సభకు హాజరైన చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

బాధ్యతగా విధులు నిర్వర్తిస్తేనే సంతృప్తి

చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు

ప్రజాశక్తి - చింతలపూడి

బాధ్యతగా విధులు నిర్వర్తించినప్పుడే ఆత్మ సంతృప్తి కలుగుతుందని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు అన్నారు. చింతలపూడి సబ్‌జైల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన గోలి వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా సబ్ జైల్ ఆవరణలో ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. మధుబాబుతో పాటు జిల్లా సబ్ జైళ్ల అధికారి అప్పలనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ సబ్ జైల్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన వెంకటేశ్వరావు ఖైదీల పట్ల సత్ప్రవర్తనతో మెలిగి మంచి మార్గాన నడవాలని సూచించేవారన్నారు. జిల్లా సబ్ జైళ్ల అధికారి అప్పలనాయుడు మాట్లాడుతూ 40 ఏళ్ల పాటు వెంకటేశ్వరావు బాధ్యతగా పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి సబ్ జైల్ నూతన సూపరింటెండెంట్ కృపానందం, సోషల్ వర్కర్ అక్బర్ అలి పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి : ఎంఎల్‌ఎ పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

వచ్చే మూడేళ్లలో రోడ్లను మెరుగు పరుస్తామని, అవసరమైన చోట ఎస్‌సి, బిసి, ఎస్‌టి, ఒసి కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ చెప్పారు. మండలంలోని మార్టేరు శ్రీవేణుగోపాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఆచంట నియోజకవర్గ స్థాయి పెంచిన పింఛన్ల పంపిణీ సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధికారం లోకొచ్చిన వెంటనే పింఛన్ పెంచి వెంటనే పంపిణీ చేస్తున్న ఘనత టిడిపి కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆచంట నియోజకవర్గంలో రూ.19.65 కోట్ల పింఛన్ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. టిడిపి ప్రభుత్వంలో అందరికీ సమాన హక్కులు ఉంటాయని, చంద్రబాబు ప్రభుత్వంలో ప్రజాప్రతి నిధులకు గౌరవం ఇచ్చే విధంగా పరిపాలన కొనసాగుతుం దన్నారు. సెప్టెంబర్ నెలలో అన్నా క్యాంటీన్లను ఆచంట, పెనుగొండ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసే దిశగా ఆలోచనలు చేస్తున్నామన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం, రైతుల ప్రాధాన్యత, నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేస్తుందని చెప్పారు. అధికారంలోకి రాగానే మొదటి సంతకం నిరుద్యోగ యువతకు భరోసాగా మెగా డిఎస్‌సిపై, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే విధంగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామాల్లో పెద్దలు, ఉద్యోగులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన ప్రభుత్వ అధికారులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవులపల్లిలో చోరీ

రూ.3.70 లక్షల నగదు, బంగారం, వెండి అపహరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని దేవులపల్లి గ్రామంలో పారేపల్లి లక్ష్మణరావు ఇంట్లో చోరీ జరిగింది. ఈ చోరీలో రూ.3.70 లక్షల నగదు, పది కాసుల బంగారం, కేజీ వెండి అపహరణకు గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాము కుటుంబసమేతంగా మూడురోజుల క్రితం ఊరు వెళ్లామని, తిరిగి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కలిదిండిలో వ్యాపారిపై దాడి

నగదు అపహరణ

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక ప్రముఖ కిరాణా వ్యాపారిపై దాడి చేసి నగదు అపహరించిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ప్రధాన సెంటర్‌లో కిరాణా షాపు యజమాని బత్తుల హనుమంతరావు ఎప్పటిలాగే వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో దారిలో దాడి చేసి నగదు బ్యాగు అపహరించినట్లు సమాచారం. దాడిలో తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అపహరణకు గురైన నగదు రూ.లక్షల్లో ఉండొచ్చని భావిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం గొల్లగూడెం వాసి కలిదిండిలో ఎస్‌టిడి బూత్ నడుపుతూ రాత్రి ఇంటికి వెళ్లే సమయంలో హత్యకు గురికావడం నాడు సంచలనమైంది. ఇప్పుడు ప్రధాన సెంటర్లోనే ఇలా జరగడంతో వ్యాపారులు ఒకింత ఆందోళనకు గురవుతున్నారు. గాయపడిన వ్యాపారి హనుమంతరావును తన ఇంటి వద్ద ఎంపిటిసి సభ్యులు నీలి సుమన్, గోదావరి సత్యనారాయణ, ఆర్య వైశ్య నాయకులు, పలువురు వ్యాపారులు పరామర్శించారు. హనుమంతరావు షాపును ఎస్ఐ ప్రియకుమార్ బాధితునితో కలిసి ఆదివారం సాయంత్రం పరిశీలించారు.

వ్యక్తిపై దాడి చేసినవారిపై కేసు

ప్రజాశక్తి - ముసునూరు

వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాటెనిపాడు గ్రామంలోని హరిజనవాడలో కొన్ని రోజుల నుంచి జలజీవన్ మిషన్ పథకం ద్వారా పైపు లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తన ఇంటికి వెళ్లే దారిలో పైపులైను వేయడంలేదని, దీనిపై పంచాయతీ కార్యదర్శి కూడా సమాధానం చెప్పడంలేదని అదే గ్రామానికి చెందిన వైసిపి నేత అమర్ల శ్రీనివాసరావు ఇటీవల మంత్రి పార్థసారథిని కలిసి సమస్య వివరించారు. దీంతో మంత్రి స్పందించి గ్రామంలో అన్ని చోట్ల పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పైపులైన్ నిర్మాణం విషయంపై వైసిపి నేత శ్రీనివాసరావు శనివారం రాత్రి పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి శ్రీనివాసరావుతో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు వైసిపి నేత శ్రీనివాసరావుపై రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో గాయాలపాలైన నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుని ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకరులు కావలెను
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా?
మీకు సామాజిక స్పృహ ఉన్నదా?
విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన
-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-
నూజివీడు, జంగారెడ్డిగూడెం, కైకలూరు, తాడేపల్లిగూడెం, భీమవరం అర్బన్
రూరల్ కేంద్రాలు: దెందులూరు, పెదవేగి, విజయరాయి, ఏలూరు, పెదపాడు, నిడమర్రు, లింగపాలెం, వేలేరుపాడు, తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, అత్తిలి, ఇరగవరం, నరసాపురం, భీమవరం, ఆకివీడు, మొగల్తూరు
ఇంటర్వ్యూ : తేది: 01-07-24 సోమవారం ఉదయం 9.30 గంటల నుండి
ఇంటర్వ్యూ జరుగు ప్రదేశం:
ప్రజాశక్తి కార్యాలయం, బొలుసువారివీధి, పవర్‌పేట, ఏలూరు
ఫోన్ నెం: 99493 66196, 89191 70815, 94900 99168, 94900 99190

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం
జీలుగుమిల్లి గ్రామం, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా
డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో
నిరంతరం ప్రజల మన్ననలు పొందుతూ సేవలందిస్తున్న
వైద్యులకు మరియు సిబ్బంది అందరికీ
ఇవే మా హృదయపూర్వక "డాక్టర్స్ డే" శుభాకాంక్షలు
డా॥ బి. గాయత్రి MBBS
PHC. జీలుగుమిల్లి
మరియు PHC సిబ్బంది

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
ప్రజాశ్రేయస్సు కొరకు రేయింబవళ్ళు
శ్రమిస్తున్న వైద్యాధికారులకు, వైద్య సిబ్బందికి
డాక్టర్స్ డే శుభాకాంక్షలు...
ఆరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరిపల్లి మండలం, ఏలూరు జిల్లా
సగ్గురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరిపల్లి మండలం, ఏలూరు జిల్లా
ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరిపల్లి మండలం, ఏలూరు జిల్లా
జె. జగన్మోహనరావు, వైద్యాధికారి - 1
ఎస్. కె. టీనా, వైద్యాధికారి - 2
పి. మంజులా దేవి, వైద్యాధికారి - 1
బి. సంధ్యారాణి, వైద్యాధికారి - 2
ఆర్. నాగ జ్యోత్స్న, వైద్యాధికారి - 1

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
శ్రీ కృష్ణ మెడికల్ జనరల్ స్టోర్స్
పానకాలు మందులషాపు 9399990199 - 9494859666 మెయిన్‌రోడ్ - ద్వారకాతిరుమల
ప్రొ॥ ములకాల పానకాలు

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం
కామయ్యపాలెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా
డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
మిత్రులకు,
శ్రేయోభిలాషులకు,
ప్రజలందరికీ
డాక్టర్స్ డే శుభాకాంక్షలు
డా॥ పి. హేమలత MBBS, PHC. కామయ్యపాలెం
మరియు PHC సిబ్బంది
డా॥ ఎస్. దిలీప్ సాయిచంద్ MBBS, PHC. కామయ్యపాలెం

పాల దంతాల పట్ల జాగ్రత్త అవసరం

స్టార్ డెంటల్ ఆసుపత్రి డాక్టర్ శ్రీహర్ష



ప్రజాశక్తి - ఏలూరు

పిల్లలకు ముందుగా వచ్చి ఊడిపోయే దంతాలను పాల దంతాలు, డెసిడ్యూమస్ దంతాలు అంటారని, వీటి పట్ల అశ్రద్ధ తగదని స్టార్ డెంటల్ ఆసుపత్రి డాక్టర్ శ్రీహర్ష తెలిపారు. ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. ఈ దంతాలు ఎలాగూ ఊడిపోయేవే అని చాలామంది అశ్రద్ధ చేస్తారని, అవి పాడైపోవడానికి, శాశ్వత దంతాలు, వాటి అమరికకు వచ్చే లోపాలే ప్రధాన కారణమని తెలిపారు. పాల దంతాలు చిన్న వయస్సులో ఆహారం నమలడానికి, శాశ్వత దంతాల అమరిక, దవడ ఎముక, నోటిలోని ఇతర కండరాలు సాధారణంగా పెరగడానికి, పిల్లల భాష, ఉచ్చరణ మెరుగ్గా ఉండడానికి దోహదపడతాయని తెలిపారు. చాక్లెట్లు, జిగురుగా ఉండే పదార్థాలు, చక్కెర ఎక్కువగా ఉండే చిరుతిండ్లు మొదలగు వాటికి పిల్లలను సాధ్యమైనంత వరకూ దూరంగా ఉంచాలని సూచించారు. లేకుంటే వాటి బలాన్ని తగ్గిస్తాయని తెలిపారు. ఆహారం తీసుకున్న వెంటనే నోటిని శుభ్రం చేసుకోవడం చిన్నతనం నుంచి అలవాటు చేయాలన్నారు. రాత్రి పడుకునే ముందు బ్రష్ చేయడం వారి దినచర్యలో భాగమయ్యేలా చూడాలన్నారు. చిన్న వయసులో పాల సీసాను పిల్లల నోటికి సరిగ్గా అందించకపోవడం, రాత్రంతా నోటిలో ఉంచేయడం వల్ల మొదటిగా దంతాలు పుచ్చడం ప్రారంభమవుతాయని తెలిపారు. దీన్ని బేబీ బాటిల్ కేరిస్ అంటారని తెలిపారు. దీనిద్వారా మిగతా అన్నింటికీ సోకి దంత సమస్యలు తీవ్రమవుతాయని వివరించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

పిల్లలకు పాల సీసాను పట్టించిన వెంటనే తాగునీరు, తడిపిన దూదితో నోటిని శుభ్రం చేయాలని డాక్టర్ శ్రీహర్ష తెలిపారు. చిన్న వయస్సులోనే తల్లిదండ్రులు చిగుళ్ల మసాజ్ చేయడం ద్వారా ఎముక ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. నోట్లో వేలు పెట్టడం, నాలుకతో దంతాలను తోయడం, నోటితో గాలి పీల్చడం వంటివి ముందుగానే గుర్తించి వాటిని మాన్పించాలని సూచించారు. పిల్లల్లో పాల దంతాలు, శాశ్వత దంతాల అమరిక, వచ్చే సమయాలు ఒకేలా ఉండవన్నారు. సాధారణంగా శాశ్వత దంతాలు ఆరు లేదా ఏడు సంవత్సరాల వయస్సులో వస్తాయని, కొన్ని సందర్భాల్లో కొంతమందికి కొంచెం లేటుగా లేదా తొందరగా వస్తాయని తెలిపారు.

పాల దంతాలు.. చికిత్స విధానాలు

పిల్లలకు పుచ్చు దంతాలకు మొదటిగా ఫిల్లింగ్స్ చేయించుకోవాలని తెలిపారు. అవి ఇంకా ఎక్కువగా ఉంటే వాటికి రూట్‌కెనాల్ చేయించుకోవాలన్నారు. రూట్‌కెనాల్ చేసే స్టేజ్ దాటిపోయే స్థాయిలో ఉంటే దంతాలు తీయించుకుంటే స్పేస్ మెంట్‌మేనర్స్ వాడాలని తెలిపారు. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు చూసుకుని ఆరు నెలలకోసారి దంత వైద్యుడిని సంప్రదించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
శ్రీ కృష్ణ హాస్పటల్
SRI KRISHNA HOSPITAL, Serving Happiness to Lives, ELURU
ఆర్థోపెడిక్ | రుమటాలజీ | జనరల్ మెడిసిన్ | జనరల్ సర్జరీ | న్యూరాలజీ | న్యూరో సర్జరీ | ఆప్తాల్మాలజీ | కార్డియాలజీ | ప్లాస్టిక్ సర్జరీ | ఎండో క్రైనాలజీ | న్యూరోసైకియాట్రీ | యూరాలజీ | ఎండో వాస్కులర్ & రేడియాలజీ
డా॥ బి.కృష్ణ గారు, స్పైన్ & జాయింట్ సర్జన్
బెండపూడి వారి వీధి, ఆర్.ఆర్.పేట, విజయ బార్ ఎదురుగా, ఏలూరు - 2.
91540 69506, 08812-352032

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
నిత్యం ప్రజల కొరకు, ప్రజాశ్రేయస్సు కోరుతూ, రేయింబవళ్ళు శ్రమిస్తున్న
జిల్లా ఉన్నతాధికారులకు, మండల వైద్య అధికారులకు,
ఇవే మా డాక్టర్స్ డే శుభాకాంక్షలు...
J. విల్సన్‌బాబు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, గణపవరం మండలం
Dr. PHRS సంతోష్, మెడికల్ ఆఫీసర్, గణపవరం మండలం
Dr. కిరణ్మయి, మెడికల్ ఆఫీసర్, గణపవరం మండలం

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
నిత్యం ప్రజలకు వైద్యం
ద్వారా సేవలందిస్తున్న
వైద్యులందరికీ
ఇవే డాక్టర్స్ డే
శుభాకాంక్షలు...
డా॥ రమేష్ గారు వైద్యాధికారి
డా॥ రాజశేఖర్ గారు
సిబ్బంది
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
పెదకాపవరం, ఆకివీడు మండలం
ప.గో.జిల్లా

పిఆర్‌పి ఇంజక్షన్‌తో మోకాళ్ల నొప్పులు దూరం

శ్రీకృష్ణ హాస్పటల్ ఆర్థో, స్పైన్ అండ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బి.కృష్ణ





ప్రజాశక్తి - ఏలూరు

పిఆర్‌పి ఇంజక్షన్ చేయించుకోవడం ద్వారా మోకాళ్ల నొప్పికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని శ్రీ కృష్ణ హాస్పటల్ ఆర్థో, స్పైన్ అండ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బి.కృష్ణ తెలిపారు. ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా మోకాలికి ఎక్స్‌రే తీయించాలన్నారు. ఈ పరీక్ష ద్వారా మోకాళ్ల అరుగుదలను స్టేజ్-1, స్టేజ్-2, స్టేజ్-3 అని మూడు కేటగిరీలుగా వర్గీకరిస్తామని చెప్పారు. అయితే ఒకటి, రెండు దశల్లో మాత్రమే పిఆర్‌పి ఇంజక్షన్ చేయించుకోవాలని, మూడో దశలో ఈ ఇంజక్షన్ చేయించుకోకూడదని తెలిపారు. ఈ పిఆర్‌పి ఇంజక్షన్ వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా రావని తెలిపారు. ఇంజక్షన్ చేసేటప్పుడు నొప్పి లేకుండా చేసే వైద్య విధానమని తెలిపారు. ప్రతి పేషెంట్ వారి మోకాలి అరుగుదల స్టేజ్ బట్టి ఈ ఇంజక్షన్ చేయాలా లేక రెండో స్టేజ్‌లో చేయాలా అనేది నెల లేదా రెండు నెలల వ్యవధిలో నిర్ధారిస్తామని తెలిపారు. ఈ ఇంజక్షన్ మోకాలికి మాత్రమేగాక మోచేతికి, భుజానికి కూడా చేసుకోవచ్చని తెలిపారు. ఇంజక్షన్ ముందుగానే చేయించుకుంటే మోకాళ్ల నొప్పులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. పిఆర్‌పి ఇంజక్షన్ చాలా తేలికైన పద్ధతి అన్నారు. ఈ ఇంజక్షన్‌ను చేయించుకోవడానికి భయపడనవసరం లేదని చెప్పారు. ఇంజక్షన్ చేయించుకుని గంటలో వారు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యి ఇంటికి వెళ్లిపోవచ్చని తెలిపారు. పిఆర్‌పి మందు కాదని, కేవలం రోగి రక్తం నుంచి వేరు చేయు ప్లాస్మా కణాల సముదాయం మాత్రమేనని తెలిపారు.

గిరిపుత్రులకు సేవలందిస్తూ.. మన్ననలు

వైద్యశిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్లు, సిబ్బంది (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వైద్యో నారాయణో హరి అంటారు. ప్రాణం పోసేవాడు దేవుడైతే ప్రాణాలను నిలబెట్టే వారు వైద్యులు. వైద్యులను దేవుళ్లతో సమానంగా పూజిస్తారు. అన్ని వృత్తుల కంటే వైద్య వృత్తి పవిత్రమైంది. జీలుగుమిల్లి మండలంలోని రాచన్నగూడెం, జీలుగుమిల్లి, కామయ్యపాలెంలో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ మూడు పిహెచ్‌సిల్లో ఇటీవల చేరిన వైద్యులు తమదైన శైలిలో గిరిపుత్రులకు మెరుగైన వైద్యం అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. అదే విధంగా మారుమూల గ్రామాల్లో సైతం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందంచడమే కాకుండా వ్యాధుల నివారణకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. ఇటీవల జీలుగుమిల్లిలోని ఆశ్రమ బాలుర వసతి గృహంలో 40 మంది విద్యార్థులకుపైగా అస్వస్థతకు గురైన సమయంలో కూడా సిబ్బందిని అప్రమత్తం చేసి వారికి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూ 24 గంటలపాటు వారికి నాణ్యమైన వైద్యాన్ని అందించి ప్రమాద తీవ్రత నుంచి కాపాడారు. ఈ సంఘటనపై జిల్లా ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు కూడా అందుకున్నారు. అదే విధంగా ఏజెన్సీ గ్రామాల్లో పలు రకాల వ్యాధులు రాకుండా అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యం చేయడంపై ప్రజాశక్తి వివరణ కోరగా గిరిజన గ్రామాలకు వైద్యం చేయడం చాలా గర్వంగా ఉందని చెబున్నారు.

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
జంగారెడ్డిగూడెం ప్రజలకు,
ప్రజాప్రతినిధులకు,
అధికారులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు,
వైద్య సిబ్బందికి
డాక్టర్స్ డే శుభాకాంక్షలు
డా॥ కె. వజ్ర కిరణ్, సివిల్ సర్జన్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
నిత్యం ప్రజల కొరకు, ప్రజాశ్రేయస్సు కోరుతూ, రేయింబవళ్ళు శ్రమిస్తున్న
జిల్లా ఉన్నతాధికారులకు, మండల వైద్య అధికారులకు,
ఇవే మా డాక్టర్స్ డే శుభాకాంక్షలు...
చైతన్య హాస్పిటల్, ఆగిరిపల్లి
డా॥ కె. సురేష్ కుమార్, ఎం.బి.బి.ఎస్
రక్షిత మెడికల్స్, ఆగిరిపల్లి
డా॥ కె. రవి శంకర్, ఆగిరిపల్లి, ముసునూరు, నూజివీడు మండల ఆర్.ఎం.పి.డబ్ల్యు.ఎ. సెక్రటరీ

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
అహర్నిశలు శ్రమిస్తూ, నిత్యం ప్రజలకు
అందుబాటులో ఉంటూ రేయింబవళ్ళు
ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న
డాక్టర్లకు, వైద్య సిబ్బందికి మరియు
మండల ప్రజలకు
డాక్టర్స్ డే శుభాకాంక్షలు...
ప్రజాశక్తి అభిమాని
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
ఉంగుటూరు మండలంలోని ప్రజలకు, రేయింబవళ్ళు ఆదర్శంగా సేవలు అందిస్తూ...
చేబ్రోలు పిహెచ్‌సికి అవార్డులు సాధించిన వైద్యులు, వైద్య సిబ్బందికి అభినందనలతో...
డాక్టర్స్ డే శుభాకాంక్షలు...
డా॥ కలిదిండి సుబ్రహ్మణ్య వర్మ, వైద్యాధికారి, చేబ్రోలు పిహెచ్‌సి, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా
డా॥ డి.శ్రావణ్ రెడ్డి, వైద్యాధికారి, చేబ్రోలు పిహెచ్‌సి
మరియు ఆసుపత్రి, సబ్ సెంటర్ స్టాఫ్, ఇతర సిబ్బంది, ఉద్యోగులు
ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
చేబ్రోలు, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
రాచన్నగూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా
మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ప్రజలందరికీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు
డా॥ కె. దివ్య MBBS, PHC. రాచన్నగూడెం
మరియు PHC సిబ్బంది
డా॥ ఎం. రాగబిందు MBBS, PHC. రాచన్నగూడెం

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో
నిరంతరం ప్రజల మన్ననలు పొందుతూ సేవలందిస్తున్న
వైద్యులకు మరియు సిబ్బంది అందరికీ
ఇవే మా హృదయపూర్వక "డాక్టర్స్ డే" శుభాకాంక్షలు
డా॥ సరాబు సునీల్ గారు
కాళ్ళ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం
కాళ్ళ మండలం

ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం సురక్షితం

జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్‌వివిఆర్.వరప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రజలు ఆర్‌టిసి బస్సుల్లో రాకపోకలు సాగించడం ద్వారా సురక్షితమైన ప్రయాణం చేయడమేకాక డబ్బును సైతం ఆదా చేసుకోవచ్చని జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్‌వివిఆర్.వరప్రసాద్ అన్నారు. గత వేసవిలో ఆర్‌టిసికి ఆదాయం ఎలా ఉంది, జిల్లాలోని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏమైనా నడుపుతున్నారా, పాఠశాలలు తెరిచిన నేపథ్యంలో బస్సుపాస్‌ల ప్రక్రియ ప్రారంభమైందా వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: జిల్లాలో మొత్తం ఎన్ని డిపోలు ఉన్నాయి? ఎన్ని బస్సులు ఉన్నాయి? ఎన్ని రూట్లలో సర్వీసులు నడుపుతున్నారు?

జవాబు: జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడులో మొత్తం మూడు డిపోలు ఉన్నాయి. మూడు డిపోల పరిధిలో 223 ఆర్‌టిసి బస్సులు, 75 అద్దె బస్సులు ఉన్నాయి. మొత్తం 98 రూట్లలో లక్షా ఎనిమిది వేల కిలోమీటర్లు తిరుగుతున్నాయి. రోజుకు 70 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.

ప్రశ్న: గత వేసవిలో సెలవుల సందర్భంగా ఆర్‌టిసి ఆదాయం ఎలా ఉంది? ప్రత్యేక బస్సులు ఏమైనా నడిపారా?

జవాబు: వేసవి సందర్భంగా ఈ సంవత్సరం రోజుకి 40 లక్షల ఆదాయం ఆర్‌టిసికి వచ్చింది. గతేడాదితో పోలిస్తే రూ.లక్ష అదనంగా ప్రతిరోజూ వచ్చింది. వేసవిలో హైదరాబాదుకు ప్రతిరోజూ నాలుగు సర్వీసులు అదనంగా నడిపాము.

ప్రశ్న: ఏలూరు జిల్లా నుంచి నడుపుతున్న ప్రత్యేక సర్వీసుల వివరాలు?

జవాబు: కోనసీమ జిల్లా రావులపాలెం సమీపంలో ఉన్న వాడపల్లికి ప్రతి శనివారం 12 బస్సులు నడుపుతున్నాం. వీటి ద్వారా రెండున్నర లక్షల అదనపు ఆదాయం వస్తుంది. ప్రతి శనివారం ద్వారకాతిరుమలకు ఐదు అదనపు బస్సులు నడుపుతున్నాం. ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణ సందర్భంగా అరుణాచలం ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. ఆదరణ బాగుంది.

ప్రశ్న: పాఠశాలలు తెలిసిన నేపథ్యంలో విద్యార్థులకు బస్సు పాసులు ఇస్తున్నారా?

జవాబు: పాఠశాలలు తెరిచిన నేపథ్యంలో అన్ని డిపోల పరిధిలో బస్సు పాస్ కౌంటర్లు ప్రారంభించాం. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కౌంటర్లు తెరిచి ఉంటాయి. ఆడ పిల్లలకు పదో తరగతి వరకు, మగ పిల్లలకు ఏడో తరగతి వరకు ఇచ్చే ఉచిత పాస్‌లు జిల్లాలో 10 వేలు ఉన్నాయి.

ప్రశ్న: బస్టాండ్లలోని షాపుల్లో తిరుబండారాలు, వాటర్ బాటిల్స్ ఎంఆర్‌పి కంటే ఎక్కువ అమ్ముతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. మీ దృష్టికి ఏమైనా వచ్చాయా?

జవాబు: గతంలో మా దృష్టికి వచ్చినప్పుడు వ్యాపారస్తులను హెచ్చరించాం. ఏమైనా ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. ఒకే దుకాణంపై ఎక్కువ ఫిర్యాదులు వస్తే ఆ షాపు లీజును రద్దు చేస్తాం.

ప్రశ్న: బస్టాండ్లలోని సైకిల్ స్టాండ్లలో ఎక్కువ ధరలు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ధరలు ఎవరు నిర్ణయిస్తారు?

జవాబు: సైకిల్ స్టాండ్ ధరలు ఆర్‌టిసి అధికారులే నిర్ణయిస్తారు. చుట్టుపక్కల ప్రాంతాల్లోని సినిమా థియేటర్లు, రైల్వేస్టేషన్లోని ధరలు పరిశీలించి కమిటీ ఒక ధర నిర్ణయిస్తుంది. దానికంటే ఎక్కువ వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఆర్‌టిసిలో ఎక్కువగా పాత బస్సులు ఉండటం వల్ల తరచూ బస్సులు ఆగిపోతున్నాయి. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: బస్సుల్లో సాంకేతిక సమస్యల వల్ల ఎప్పుడైనా ఆగిపోవచ్చు. బస్సుల్లో ఏ సమస్య వచ్చినా వెంటనే రిపేర్ చేసే అవకాశం ఉంది. ఎప్పటికప్పుడు బస్సులను తనిఖీ చేసి సర్వీసింగ్ చేయిస్తున్నాం. అయినప్పటికీ ఒక్కోసారి సాంకేతిక సమస్యలు వస్తుంటాయి. వెంటనే బాగు చేయిస్తున్నాం. కాలం చెల్లిన బస్సులు అంటే 15 సంవత్సరాలు దాటిన బస్సులను ఆపివేస్తున్నాం. అలా ఈ మధ్యకాలంలో ఐదు బస్సులు ఆపివేశాం. ఆగస్టులో మరో రెండు బస్సులు ఆపేస్తాం. మిగిలిన బస్సులను ఎప్పటికప్పుడు పరిశీలించి కండిషన్లో ఉంచుతాం.

ప్రశ్న: జిల్లాలో ఆర్‌టిసి కార్గో సర్వీసులు ఎలా నడుస్తున్నాయి?

జవాబు: ఆర్‌టిసి కార్గో సర్వీస్‌కు ప్రజల నుంచి ఆదరణ బాగా పెరిగింది. గతేడాది కార్గో ద్వారా రూ.3.80 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ సంవత్సరం రోజుకి లక్షా పదివేలు ఆదాయం వస్తుంది. ఇతర కొరియర్ సర్వీసులతో పోలిస్తే ఆర్‌టిసిలో ఛార్జీలు తక్కువగా ఉండటం, తక్కువ సమయంలో పార్సిల్ అందించడం వల్ల ఇది మంచి ఆదరణతో నడుస్తుంది.

ప్రశ్న: చివరిగా ప్రజలకు మీరు ఇచ్చే సలహా ఏమిటీ?

జవాబు: ఆర్‌టిసిలో ప్రయాణం సురక్షితం. అలాగే ప్రయివేట్ ట్రావెల్స్‌తో పోలిస్తే ధరలు తక్కువ. కాబట్టి ప్రయాణికులు ఆర్‌టిసిలో ప్రయాణించి సురక్షిత ప్రయాణం చేసి ఆర్‌టిసి అభివృద్ధికి పాటుపడాలని కోరుతున్నాను. ఆర్‌టిసిని ప్రజలు ఆదరిస్తే మరిన్ని సేవలు అందించడానికి అవకాశం ఉంటుంది.

రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఆచంట

సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వైద్యులు మెరుగైన వైద్య సేవలందించడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. ఆదివారం ఆచంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ సి.నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేసి, పలు వైద్య విభాగాలను పరిశీలించారు. తొలుత డ్యూటీ రిజిస్టర్‌ను పరిశీలించి ఎంతమంది డ్యూటీలో ఉన్నారు అని అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సమయంలో వైద్యాధికారి విధుల్లో లేకపోవడాన్ని గమనించి విధుల్లో లేకుండా ఎక్కడకు వెళ్లారని సిబ్బందిని ప్రశ్నించారు. ఓపి వార్డులు, ప్రసూతి వార్డులను పరిశీలించి అక్కడ రోగులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఆసుపత్రికి వచ్చే డెలివరీ కేసులు, ఓపి కేసులు, హాస్పటల్లో ఇన్ పేషెంట్లు వైద్య సేవలు పొందుతున్న వారి సంఖ్యను ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా పేద, మధ్య తరగతికి చెందిన ప్రజలు ఎంతో నమ్మకంతో ఇక్కడకు వస్తారని, ఎల్లప్పుడూ రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాల్సిన బాధ్యత డాక్టర్లపై ఉందని తెలిపారు. అవసరమైన మందులను ఎప్పటికప్పుడు ఇండెంట్ ద్వారా తెప్పించుకొని అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అతిసార, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తాను తరచూ ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేస్తానని, వైద్య సేవల్లో లోపాలు కనిపించినా, రోగుల నుంచి ఒక్క ఫిర్యాదు వచ్చినా సంబంధిత వైద్యాధికారులు, వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జులై 01 తేదీ నుంచి ఆగస్టు 31వ వరకూ డయేరియా నియంత్రణపై ప్రచార కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థల భాగస్వామ్యంతో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్స్ జి.రుక్మిణి, ఫార్మసిస్ట్ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

పిల్లలను పనుల్లో పెట్టొద్దు

భీమవరం టౌన్: విద్యపై అవగాహన లేక తల్లిదండ్రులు తమ పిల్లలను పనుల్లో పెట్టడం వారి భవిష్యత్‌ను తుంగలో తొక్కడమేనని, రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యతనిస్తోందని శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ అన్నారు. ఆదివారం గునుపూడిలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బడికి పోదాం రా కార్యక్రమాన్ని నిర్వహించి హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి తరంలో విద్య లేనిదే జీవితాలు శూన్యమన్నారు. ప్రతి విద్యార్థీ చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సదుపాయాలూ ప్రభుత్వం కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం 70 మంది హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొండ్రు శ్రీనివాస్, హాస్టల్ వార్డెన్ భానుమణి విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 1538 కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 1538 కేసులు పరిష్కరించినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌కు జిల్లావ్యాప్తంగా 35 బెంచ్‌లు ఏర్పాటు చేశామని, వీటిలో ఏలూరులో 9, భీమవరం 5, కొవ్వూరు 3, నరసాపురం 4, తణుకు 4, తాడేపల్లిగూడెం 5, పాలకొల్లు, నిడదవోలు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, భీమడోలు కోర్టుల్లో ఒక్కో బెంచ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పరిష్కరించిన 1538 కేసుల్లో 1254 క్రిమినల్, 129 మోటార్ వాహన ప్రమాద బీమా, 153 సివిల్ కేసులను రాజీ చేసినట్లు తెలిపారు. 102 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఏలూరులో 568, భీమవరంలో 172, చింతలపూడిలో 55, జంగారెడ్డిగూడెంలో 61, కొవ్వూరులో 120, నర్సాపురంలో 105, పాలకొల్లులో 70, తాడేపల్లిగూడెంలో 184, తణుకులో 129, నిడదవోలులో 37, భీమడోలులో 37 కేసులు పరిష్కరించామని తెలిపారు. వీటితోపాటుగా జిల్లావ్యాప్తంగా 2356 పెట్టీ కేసులనూ రాజీ చేశామని పేర్కొన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో ఆన్‌లైన్ ద్వారా పది కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. తాడేపల్లిగూడెం కోర్టుకు సంబంధించిన కేసుల్లో కక్షిదారులు ఏలూరులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై తమ కేసులను రాజీ చేసుకున్నారని పేర్కొన్నారు. కక్షిదారులు ఇక ముందు కూడా ఈ ఆన్‌లైన్ విధానం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని, తద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. వాహన ప్రమాద బీమా కేసుల్లో రూ.8 కోట్లకు పైగా పరిహారం కింద చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, వివిధ శాఖల సిబ్బందికి పురుషోత్తమకుమార్‌తోపాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ-కం-సీనియర్ సివిల్‌జడ్జి కె.రత్నప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

టీమ్ ఇండియా విజయంపై హర్షం

భీమవరం టౌన్: టి-20 క్రికెట్ ప్రపంచ ఛాంపియన్‌గా విజయం సాధించిన భారత టీంపై హర్షాతిరేకాలు తెలియజేస్తూ భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ భవనంలో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థలు, క్రీడా సంస్థలతో సంబరాలను ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర మాల్యంపోల్ అసోసియేషన్ కార్యదర్శి జిపిసి శేఖర్‌రాజు మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలోనే ఎంతో ఉత్కంఠ భరితంగా సాగిన టి-20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సౌత్ ఆఫ్రికాపై భారత్ ఘన విజయం సాధించిందని, 17 సంవత్సరాల నిరీక్షణ తరువాత రెండోసారి ఈ కప్‌ను భారత్ గెలుచుకోవడం శుభపరిణామమని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, నందమూరి రాజేష్ మాట్లాడుతూ క్రికెట్ ప్రపంచ కప్‌లో భారత దేశానికి గర్వించదగ్గ గొప్ప విజయమన్నారు. పట్టణ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, బార్ ఛాంబర్ సభ్యులు టీం ఇండియాకు శుభాకాంక్షలు తెలిపారు.

బాధితునికి లాక్షణ్య ట్రస్ట్ సాయం

ప్రజాశక్తి - ఉండి

ఉండి గ్రామానికి చెందిన కూతాడ ఏసు రక్తనాళాలు దెబ్బతిని మంచాన పడడంతో లాక్షణ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎస్.ప్రదీప్ ఏసు కుటుంబానికి రూ.15 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే అదే ప్రాంతానికి చెందిన యువత మరో ఐదు వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ ఏసు తోపుడు బండిపై చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని, కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగోకపోవడంతో భీమవరంలోని ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోగా రక్తనాళాలు దెబ్బతిన్నాయని, అత్యవసరంగా ఆపరేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఉందని, దానికి సుమారు రూ.25 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో ఏసు కుటుంబం దిక్కుతోచని పరిస్థితుల్లో దాతల సాయం కోసం ఎదురుచూస్తోందని తెలిపారు. దాతలు సహకరించి ఏసు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రదీప్ కోరారు.

కొవ్వలి రామ్మోహన్ నాయుడు సేవలు గొప్పవి

ప్రజాశక్తి - నరసాపురం

సమాజానికి కొవ్వలి రామ్మోహన్ నాయుడు చేస్తున్న సేవలు గొప్పవని 31వ వార్డు కౌన్సిలర్ పొలూరి నరసింహారావు (బాబ్జీ) అన్నారు. ఆదివారం చినమామిడిపల్లి నాగారమ్మ ఆలయం వద్ద కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 52వ ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరాన్ని కౌన్సిలర్ బాబ్జీ ప్రారంభించి మాట్లాడారు. దానం గుణంలో, గుప్త దానాలు చేయడంలో కొవ్వలి రామ్మోహన్ నాయుడుకు మించిన వారు లేరన్నారు. ఆయన సంపాదనలో ఎక్కువ మొత్తాన్ని ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం గొప్ప విషయమన్నారు. పేదల కోరిక మేరకు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఆక్యుపంక్చర్ ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలందించడం అభినందనీయమన్నారు. కొవ్వలి ఫౌండేషన్ కార్యదర్శి, ఆక్యుపంక్చర్ వైద్యులు కొండా శ్రీధర్ మాట్లాడుతూ సర్వరోగ నివారిణి ఆక్యుపంక్చర్ వైద్యమన్నారు. కార్యక్రమంలో సంకు భాస్కర నాయుడు, కోటిపల్లి బ్రహ్మానందం, భోగి రెడ్డి ముత్యం, రేవు పద్మారావు, పులఖండం వీర రాఘవులు పాల్గొన్నారు.

ముఖ్య వార్తలు

త్వరలో ధాన్యం బకాయిలు విడుదల : పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

జులై మొదటి వారంలో రైతులకు రావాల్సిన ధాన్యం బకాయిలు రూ.వెయ్యి కోట్లు విడుదలవుతున్నాయని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ చెప్పారు. ఈ నెల ఒకటో తేదీన ఆచంట నియోజకవర్గ పరిధిలో పంపిణీ కానున్న పెన్షన్ల కార్యక్రమం కోసం ఆదివారం ఆయన మార్టేరు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం చంద్రబాబుతో, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో మాట్లాడిన వెంటనే వారు నిధులు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో రూ.970 కోట్లు ధాన్యం బకాయిలు ఉన్నాయని, గడిచిన రెండు నెలల్లో జగన్ ప్రభుత్వం ధాన్యం డబ్బులు చెల్లించకుండా రూ.3200 కోట్లు రుణం తీసుకుని దారి మళ్లించిందన్నారు. గత ప్రభుత్వం దశలవారీగా రూ.వెయ్యి పెంచితే చంద్రబాబు ఒకేసారి రూ.వెయ్యి పెంచి పెన్షన్ అందిస్తున్నారన్నారు.

విజయోత్సవ ర్యాలీ వాయిదా

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆదివారం మధ్యాహ్నం నుంచి జరగాల్సిన ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ విజయోత్సవ ర్యాలీ వర్షం కారణంగా తాత్కాలికంగా వాయిదా వేసినట్లు టిడిపి కార్యాలయం నుంచి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలో ర్యాలీ జరిపే తేదీని ప్రకటించనున్నట్లు తెలిపారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొనండి

తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భీమవరం నియోజకవర్గంలోని టిడిపి కూటమి నాయకులు పాల్గొనాలని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి పిలుపునిచ్చారు. భీమవరం నియోజకవర్గ టిడిపి ముఖ్య నాయకుల సమావేశం ఆమె నివాసంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భీమవరం పట్టణంలో 11,384 మంది లబ్ధిదారులకు రూ.7,88,37,500 ప్రభుత్వ సిబ్బందితో పంపిణీ చేసే కార్యక్రమాన్ని 26 వార్డుల్లో ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు ప్రారంభించనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పింఛన్ల పంపిణీని విజయవంతం చేయండి

మొగల్తూరు :సంక్షేమ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు సూచించారు. మొగల్తూరులోని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కత్తిమండ ముత్యాలరావు, మామిడి సెట్ సత్యనారాయణ, కోవూరు నాగేశ్వరరావు, పాల రాంబాబు, చెల్లిబోయిన పెద్దిరాజు, పంపన భగవాన్, మన్నె శ్రీను, శ్రీధర్, పుల్లారావు, కొల్లాటి భోగరాజు ఉన్నారు.

ముత్యాలమ్మ ఆలయం రద్దీ

మొగల్తూరు :మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణ ధికారి దెందుకూరి రామకృష్ణరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

వర్షాకాలం.. అప్రమత్తత అవసరం

కాళ్ల వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్



ప్రజాశక్తి - కాళ్ల

వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వైద్యుల సూచనలు పాటించాలని కాళ్ల వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ అన్నారు. ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందిస్తామని చెప్పారు. వర్షాకాలం ఆరంభం కావడంతో ప్రజలు రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ప్రశ్న : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డాక్టర్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉండకుండా వెళ్లే ఏర్పాట్లు చేయాలి. బ్లీచింగ్ చల్లాలి. వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాం. నిరంతరం వైద్య బృందాలు గ్రామీణ ప్రాంతాల్లో పర్యవేక్షిస్తున్నాయి.

ప్రశ్న : మండలంలో ఎన్ని సబ్ సెంటర్లు ఉన్నాయి?

డాక్టర్ : 20 సబ్ సెంటర్లు ఉన్నాయి. 20 మంది ఎంఎల్‌హెచ్‌పి లు, 20 మంది ఎఎన్‌ఎంలు ఉన్నారు. 52 మంది ఆశలు, హెల్త్ అసిస్టెంట్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రశ్న : వర్షాకాలంలో వ్యాధుల పట్ల ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి?

డాక్టర్ : వర్షాకాలం నేపథ్యంలో వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఖాళీ టైర్లు, కొబ్బరి బొండాలు, కుండీలు, టబ్‌లు వంటివి వారానికి ఒక రోజు ఖాళీ చేసుకోవాలి. లేకుంటే దోమలార్వా పెరుగుతుంది. డ్రైనేజీల్లో ఫాగింగ్ చేసుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వేడి ఆహారం తీసుకోవాలి. వీలైనంత వరకూ ఇంటి ఆహా రం తీసుకోవాలి. జ్వరం, ఇతర సమస్యలు ఉన్నా దగ్గర్లోని సబ్ సెంటర్, పిహెచ్‌సి వైద్యులను సంప్రదించాలి.

ప్రశ్న : వైద్య సిబ్బంది సహకారం ఎలా ఉంది?

డాక్టర్ : ఎఎన్‌ఎం, ఎంపిహెచ్‌ఎ, హెచ్‌సి, ఆశా వర్కర్ల సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో ఫీవర్ సర్వేలు, వైద్య సేవలు అందిస్తున్నాం. క్షేత్రస్థాయి సర్వేలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి ఇంట్లో రోగాలతో ఉన్నవారిని ముందే గుర్తిస్తూ వారికి వైద్య సహాయం అందిస్తున్నాం.

ప్రశ్న : పిహెచ్‌సిలో సిబ్బంది కొరత ఉందా?

డాక్టర్ : ఒక ఎల్‌టి పోస్ట్ ఖాళీగా ఉంది.

ప్రశ్న: పిహెచ్‌సిలో మందుల కొరత ఉందా?

డాక్టర్ : మందుల కొరత లేదు. అన్ని రకాల వ్యాధులకు సంబంధించి మందులు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న : మండలంలో డెంగీ, మలేరియా కేసులు ఎన్ని నమోదయ్యాయి?

డాక్టర్:మండలంలో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి కేసులు ఇప్పటివరకూ ఒక్కటి కూడా నమోదు కాలేదు. ముందస్తుగా వాటిని ఎదుర్కొనేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నాం.

ప్రశ్న : రోజూ ఒపి ఎంత ఉంటుంది? ఏయే ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారు?

డాక్టర్: ప్రతిరోజూ 60 నుంచి 70 మంది పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్నారు. ఎక్కువగా దొడ్డనపూడి, కాళ్ల, ఏలూరుపాడు, బొండాడ నుంచి రోగులు వస్తుంటారు.

రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలందించాలి

పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో కలెక్టర్ నాగరాణి తనిఖీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఏరియా ప్రభుత్వాసుపత్రిని కలెక్టర్ సి.నాగరాణి ఆదివారం ఆకస్మిక తనిఖీ చేసి, పలు వైద్య విభాగాలను పరిశీలించారు. ఒపి వార్డులను, ప్రసూతి వార్డులను పరిశీలించి అక్కడ ఉన్న రోగులను, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది విధులకు హాజరయ్యే వారి పేర్లు, సమయాన్ని తెలిపే డిస్‌ప్లే బోర్డును, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేయాలని చెప్పారు. అతిసార, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. తాను తరచూ ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేస్తానని, వైద్య సేవల్లో లోపాలు కనిపించినా, రోగుల నుంచి ఒక్క ఫిర్యాదు వచ్చినా సంబంధిత వైద్యాధికారులు, వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఆగస్టు 31 వరకు డయేరియా నియంత్రణపై ప్రచార కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఆమెతో పాటు ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఒ.రవికుమార్, డ్యూటీ వైద్యులు రిచర్డ్ బూన్, హెడ్ నర్సు ఎస్‌కె.ఫాతిమా, వివిధ విభాగాల వైద్య సిబ్బంది, నర్సులు ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ నాగరాణి

విశాఖ ఉక్కు పరిరక్షణకు చర్యలు

కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ

భీమవరం టౌన్ :విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదాన్ని, ఉక్కు పరిశ్రమను రక్షించుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కేంద్ర భారీ, ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. భీమవరం పట్టణంలోని పంచారామ క్షేత్రం శ్రీ ఉమా సోమేశ్వర జనార్ధన స్వామిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నెరవేర్చేందుకు తాను కృషి చేస్తానన్నారు. తాను ఈ నెల తొమ్మిదో తేదీన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తన తండ్రి అనారోగ్య రీత్యా తాను తన పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పర్యటించలేకపోయానని, పార్లమెంట్ సమావేశాలు ఈ నెల మూడో తేదీన ముగుస్తున్న నేపథ్యంలో తన పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంఎల్‌ఎలతో కలిసి ప్రజలను కలుస్తామని చెప్పారు.

పూర్తి పింఛన్ వచ్చేలా కృషి చేస్తా

మానసిక వికలాంగుని తల్లిదండ్రులకు మంత్రి నిమ్మల హామీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులోని మంత్రి, ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు కార్యాలయానికి వచ్చిన మానసిక వికలాంగుని పట్ల ఆయన మానవత్వాన్ని చాటుకున్నారు. పూలపల్లికి చెందిన మానసిక వికలాంగుడు పామర్తి హేమంత్ సాయి పవన్‌ను తీసుకుని అతని తల్లిదండ్రులు ఆదివారం మంత్రిని కలిశారు. సాయిపవన్ మానసిక పరిస్థితిని చూసి చలించిన మంత్రి బాలుడిని ఎత్తుకుని సమస్య ఏమిటంటూ అడిగారు. ప్రస్తుతం వికలాంగుల పెన్షన్ రూ.మూడు వేలు ఇస్తున్నారని, మీ దయవల్ల రేపటి నుంచి రూ.ఆరు వేలు పెరుగుతుందని, అయితే తమ కుమారుడికి పూర్తి వైకల్యం ఉండడంతో పెన్షన్ సొమ్ము పెరిగేలా చూడాలని అతని తల్లిదండ్రులు కోరారు. దీనిపై స్పందించిన మంత్రి తప్పనిసరిగా పెన్షన్ సొమ్ము రూ.15 వేల వరకు అందేలా చూస్తానంటూ భరోసా ఇచ్చారు. బాలుడికి జ్వరం వచ్చినట్లు ఉందని బృందావన్ ఆసుపత్రి డాక్టర్ వర్మకు చూపించాలని, వైద్యం చేసేలా తాను డాక్టర్‌తో మాట్లాడుతానని మంత్రి రామానాయుడు చెప్పగా అక్కడికి తీసుకెళ్లి వైద్యం చేయించారు.

కాలువలో చెత్తా, చెదారం తొలగింపు

సొంత ఖర్చులతో పనులు చేపట్టిన ఎంఎల్‌ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రధాన పంటకాలువలో ఎగువ నుంచి వచ్చిన తూడు, చెత్తా చెదారాలను తొలగించే పనులను సొంత ఖర్చులతో ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ చేపట్టారు. ఆదివారం ఆ పనులకు జనసేన నియోజకవర్గ నాయకులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రుస్తుంబాద నుంచి మొగల్తూరు లాక్ వరకు పంట కాలువ పూర్తిగా తూడు, చెత్తా చెదారంతో ఉండడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. ఇటీవల ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ పంట కాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించి సొంత ఖర్చులతో సుమారు పది కిలోమీటర్ల మేర తూడు, చెత్తాచెదారాలు పొక్లెయిన్‌తో తొలగించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో అందే దొరబాబు, ఆకన చంద్రశేఖర్, బందెల రవీంద్ర, కొల్లాటి గోపీ, దూసనపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ముందస్తుగా ఇక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. వెలమ సంఘం నాయకులు దాసరి అప్పన్న, దాసరి కృష్ణవేణి, కిలపర్తి వెంకటరావు, బండారు వెంకటరావు ఆధ్వర్యంలో అర్జున్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం పెంటపాడు వెలమ యువజన సంఘం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంఎల్‌ఎ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులను పరీక్షించి వైద్యం అందించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేయడం విశేషమన్నారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ అర్జున్ హాస్పిటల్ వైద్యులు ఇక్కడ వైద్య సేవలందించడానికి ముందుకు రావడం పట్ల వారిని అభినందించారు. ఇటువంటి వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ డైరెక్టర్ దాసరి అప్పన్న, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు దాసరి కృష్ణవేణి, జనసేన నాయకులు పుల్లా బాబి, లక్ష్మణ రెడ్డి పాల్గొన్నారు.

సత్యనారాయణకు ఘన సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మున్సిపల్ డ్రైవర్ల సంఘం అధ్యక్షులు శిరగం సత్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘం నేతలు మాట్లాడుతూ సత్యనారాయణ గత 35 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. సత్యనారాయణ దంపతులను వివిధ పార్టీల నేతలు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేత అడబాల వెంకటరమణ, చందక సత్తిబాబు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు నేడు పాలాభిషేకం

ప్రజాశక్తి - మొగల్తూరు

నూతన ప్రభుత్వం సంక్షేమ పింఛన్ల నగదు పెంపు హామీ అమలు చేయడం పట్ల కృతజ్ఞత పూర్వకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు సోమవారం పాలాభిషేకం చేయనున్నామని వికలాంగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చిక్కాల నాగ శ్రీనివాస్ (చిన్న) తెలిపారు. మండల కేంద్రమైన మొగల్తూరులోని జాతీయ రహదారి పక్కన ఉన్న యాసర్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు, టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ హాజరు కానున్నారని ఆయన తెలిపారు. వికలాంగుల సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

టిడ్కో గృహాల వద్ద రేషన్ షాపు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని టిడ్కో గృహ సముదాయం వద్ద రేషన్ షాపును రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. ఇక్కడ నివశిస్తున్న సుమారు రెండు వేల పేద కుటుంబాల సౌకర్యార్థం స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్నేని రోజారమణి, నేతలు పెచ్చెట్టి బాబు, గౌరునాయుడు,ఉన్నమట్ల కబర్ధి, పొట్నూరి శ్రీనివాసరావు, ధనాని సూర్యప్రకాష్, చౌకడిపోల మండల ప్రెసిడెంట్ సాగా బాబ్జి, సెక్రటరీ ఎస్.శ్రీనివాసరావు, కోశాధికారి అడ్డాల ఉమామహేశ్వరరావు, యాళ్ల ప్రసాద్, ఉపాధ్యక్షులు కోట గణేష్, వీఆర్‌ఒలు, అధికారులు పాల్గొన్నారు.

4న అల్లూరి శతవర్ధంతి సభ

అల్లూరి స్వగ్రామం మోగల్లు సహా నాలుగు ప్రాంతాల నుండి మోటార్ సైకిల్ ర్యాలీలు

ఎబిఎస్‌వికె ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మన్యవిప్లవ వీరుడు, స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా శత వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రం భీమవరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం తెలిపారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి నిర్వహణా కమిటీ సమావేశం ట్రస్టు కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ట్రస్టు ఛైర్మన్ బలరాం మాట్లాడుతూ మన్య విప్లవ వీరుడు, స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి, 127వ జయంతి కార్యక్రమాలు ఒకే సంవత్సరంలో రావడం విశేషమన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రమైన భీమవరంలో అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి నిర్వహణా కమిటీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా నలుమూలల నుండి అల్లూరి స్వగ్రామం మోగల్లు, తాడేపల్లిగూడెం, ఆకివీడు, నరసాపురం ప్రాంతాల నుంచి అల్లూరి త్యాగాలను స్మరించుకుంటూ పెద్దఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి స్మృతి వనం వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటుచేశామన్నారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో అల్లూరి జీవిత విశేషాలతో కూడిన సాంస్కృతిక కళారూపాలు ప్రదర్శిస్తారని తెలిపారు. బ్రిటీష్ సామ్రాజ్యానికి, తెల్లదొరల పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప పోరాట యోధుడు అల్లూరి అని కొనియాడారు. మన్య ప్రాంతంలో 1922లో గిరిజనులను సమీకరించి, వారిని పోరాట యోధులుగా తయారుచేసి మన్య విప్లవాన్ని ప్రారంభించారని తెలిపారు. సుమారు రెండేళ్లపాటు బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ఘనత దేశంలో అల్లూరికి ఉందన్నారు. నేరుగా ఎదుర్కోలేని బ్రిటీష్ సైన్యం 1924 మే 7న అల్లూరిని దుర్మార్గంగా కాల్చి చంపిందని తెలిపారు. దేశ స్వాతంత్రం కోసం కేవలం 27 సంవత్సరాలకే ప్రాణాలర్పించారన్నారు. ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్రం కోసం, ప్రజల్లో ఆర్థిక అసమానతలు పోవాలని తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. అలాంటి వ్యక్తి మన భీమవరం పరిసర ప్రాంతంలో పుట్టడం గర్వకారణమన్నారు. అలాంటి గొప్ప యోధునికి ఘన నివాళులర్పించాలని, ప్రజలందరూ భీమవరంలో జరిగే ర్యాలీలు, సభల్లో పాల్గొనాలని బలరాం కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వహణా కమిటీ సభ్యులు కె.రాజారామ్మోహన్‌రాయ్, బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, కె.క్రాంతిబాబు, బి.చైతన్యప్రసాద్, షేక్ వలీ, బత్తుల విజయ్‌కుమార్, ఎన్.రంగా, త్రిమూర్తులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

హాస్టల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండలోని అంబేద్కర్ గురుకుల బాలికల హాస్టల్లో జిల్లా కలెక్టర్ పి.నాగరాణి శనివారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకుల పాఠశాల విద్యార్థులకు సదుపాయాలు కల్పించడంలో ఎటువంటి లోపం లేకుండా చూడాలన్నారు. విద్యార్థులు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ప్రిన్సిపల్‌కు ఆదేశించారు. అనంతరం విద్యార్థులను సమస్యల అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు చక్కని విద్యా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.